ప్రజాశక్తి
శనివారం 2 సెప్టెంబర్ 2023
5
అనంతపురం



ప్రయివేటు ఆసుపత్రుల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం



చంద్రసూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డిఎంహెచ్‌ఒ

అనంతపురం పట్టణంలోని పలు ప్రయివేటు ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥ఇబి.బేబి శుక్రవారం తనికీ చేశారు. చంద్ర సూపర్ స్పెషలిటీ ఆసుపత్రితో పాటు పలు ఆసుపత్రులను తనిఖీ చేసి, అక్కడి వైద్య చికిత్సలు, ఇతర విషయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ధరల పట్టిక, రిజిస్ట్రేషన్ వాలిడిటీ, డాక్టర్ అర్హతలు మొదలగు వాటిని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఆసుపత్రులను సీజ్ చేయడంతో పాటు, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డిప్యూటీ డెమో త్యాగరాజ్ , డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్ పాల్గొన్నారు.

శతాబ్దంలో ఇదే అత్యల్పం..!

◆ ఉమ్మడి జిల్లాలో తగ్గిన వర్షపాతం ◆ ఆగస్టు మాసంలో 83.8 శాతం లోటు ◆ ఈ ఏడాది అత్యంత దుర్భిక్షం



కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో అత్యంత దుర్భిక్ష సంవత్సరంగా ఈ ఏడాది నిలిచిపోనుంది. శతాబ్దాల కరువు చరిత్రలో ఆగస్టు నెలలో అత్యల్ప వర్షపాతం పడిన సంవత్సరం ఇదే కావడం గమనార్హం. గడిచిన వంద సంవత్సరాల్లో ఎన్నడూ ఈసారిలాగా తక్కువ వర్షపాతం నమోదయిన దాఖలాల్లేవు. జూన్, జులైల్లో సరిగా వానలు లేకపోయినా, ఆగస్టు, సెప్టంబరు మాసాల్లో ఎంతో కొంత వర్షపాతం నమోదయ్యేది. కాని ఈ సంవత్సరం చినుకుజాడ లేకుండా పోయింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ వర్షాధార పంటకు అత్యంత అవసరమైన మాసం ఆగస్టు మాసమే. వర్షాధారం కింద సీజన్‌లో సాగైన పంట పూత వచ్చి, ఊడలు దిగే సమయం. ఈ సమయంలో వర్షమొస్తే ఎంతోకొంత వరకైనా పంట చేతికొస్తుంది. కాని ఈ ఏడాది ఆగస్టు మాసంలో చూస్తే అత్యల్పంగా 83.7 శాతం వర్షపాత లోటుంది. సాధారణంగా 83.8 మల్లిమీటర్లు వర్షపాతం నమోదవ్వాల్సి ఉంది. కాని పడింది మాత్రం 13.7 మిల్లీమీటర్లు మాత్రమే. ఇది కూడా కేవలం పది మండలాల్లో ఒకటి నుంచి రెండు మిల్లీమీటర్లలో వు పడింది. తక్కిన అన్ని మండలాల్లోనూ నెల మొత్తం చినుకు జాడలేదు. మొత్తం జూన్‌లో సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి నైరుతి రుతుపవనాల కాలంలో ఇప్పటి వరకు సాధారణంగా 210 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 135.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. 35.7 శాతం వర్షపాత లోటుంది. అనంతపురం జిల్లా పరిధిలో 31 మండలాలకుగానూ 24 మండలాల్లో వరాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

63 సంవత్సరాల్లో ఐదు అత్యంత దుర్భిక్ష సంవత్సరాలు

జూన్ నుంచి సెప్టంబరు వరకు ఈ నాలుగు మాసాల కాలంలో నైరుతి రుతుపవనాల కాలంగా భావిస్తారు. అప్పటి వరకు అరేబియా సముద్రం వైపు నుంచి వచ్చే గాలులతో వర్షాలు పడటం పరిపాటి ఆ తరువాత ఈశాన్య రుతుపవనాలు అక్టోబరు నుంచి మొదలవుతాయి. ఇవి బంగాళతం నుంచి వస్తాయి. అనంతపురం జిల్లాకు మాత్రం నైరుతి రుతుపవనాల కాలంలో వర్షాలు అధికంగా వస్తాయి. జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు ఏడాది కాలంలో 512 మిల్లీమీర్లు ఉంది. ఇందులో నైరుతి రుతుపవనాల కాలంలోనే 319 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. తక్కిన 193 మిల్లీమీటర్లు అక్టోబరు, నవంబరు మాసాల్లోనే అత్యధికంగా వస్తుంది. ఆ తరువాతి కాలాల్లో వర్షపాతం తక్కువనే ఉంటుంది. ఈ రకంగా చూసినప్పుడు 1960వ సంవత్సరం నుంచి 2023 వరకు చూస్తే ఐదు సంవత్సరాల్లో నైరుతి వర్షపాతం 50 శాతం లోటుతో పడటం గమనార్హం. 1994-95 సంవత్సరంలో నైరుతి కాలంలో సాధారణ వర్షపాతం 297 మిల్లీమీటర్లకుగానూ 129 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. సాధారణం కంటే 57 శాతం వర్షపాతం లోటుంది. ఆ తరువాతి నుంచి 2002-03 సంవత్సరంలో 338 మిల్లీమీటర్లకుగానూ 180 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 53 శాతం వర్షపాతం లోటుంది. 2003-04 సంవత్సరంలో 338 మిల్లీమీటర్లకుగానూ 158 మిల్లీమీటర్లు పడింది. 47 శాతం వర్షపాతం లోటుంది.



2018-19 సంవత్సరంలో 338.4 మిల్లీమీటర్లకుగానూ 212.6 మిల్లీమీటర్లు పడింది. 37.4 శాతం లోటు ఏర్పడింది. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు చూస్తే 210 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 135. మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 35.7 శాతం లోటుంది.

శతాబ్దకాలంలో ఆగస్టులో ఇదే అత్యల్పం

ఆగస్టు మాసంలో దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయినట్టు వాతావరణ శాఖ చెబుతోంది. దేశ వ్యాప్తంగా సగటు 40 శాతం వర్షపాతం లోటుంది. ఇక అనంతపురం జిల్లా వరకు వస్తే 83.7 శాతం లోటుంది. మొత్తం సంవత్సరాల్లో చూస్తే ఈ ఏడాదే అత్యల్ప వర్షపాతం కలిగిన సంవత్సరంగా భావిస్తున్నాం. సెప్టంబరులో 14లోపు అల్పపీడనం ఏర్పడి వర్షాలొచ్చే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ కాలంలో ఒక వర్షమెచ్చిన రైతులకు కొంత ఊపశమనం ఉంటుంది. ఇక 14లోపు పడకపోతే ఈ నెల కూడా వర్షాభావ పరిస్థితులే ఉండనున్నాయి.

అశోక్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త,
రేకులకుంట వ్యవసాయ పరిశోధనా క్షేత్రం.



సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న తాగునీటి సరఫరా కార్మికులు

'శ్రీసత్యసాయి' కార్మికులతో చర్చలు విఫలం

సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్ట్రగుల్ కమిటీ నాయకులు, కార్మికులతో నిర్వహించిన చర్చలు విఫలం అయ్యాయి. బకాయి వేతనాలు, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మె చేపట్టారు. ఇదివరకే అధికారులు చర్చలు నిర్వహించినా కార్మికుల నుంచి సానుకూలత రాలేదు. దీంతో శుక్రవారం స్ట్రగుల్ కమిటీ నాయకులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఇతర అధికారులు శ్రీసత్యసాయి బోర్డ్ కార్యాలయంలో చర్చలు నిర్వహించారు. సిఐటియు, వైఎస్ఆర్‌టియు, ఐఎఫ్‌టియు మూడు సంఘాలు స్ట్రగుల్ కమిటీగా ఏర్పాటై కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాట కార్యచరణ ప్రకటించి కార్మికులంతా ఐక్యంగా సమ్మెలోకి వెళ్లారు. చర్చలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, వైఎస్ఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఉపేంద్ర హాజరయ్యారు. అధికారులు కార్మికులకు 1 నెల వేతనం చెల్లిస్తున్నాం, సమ్మె విరమించాలని తెలిపారు. 5 నెలల వేతనాలు రావాల్సి ఉండగా ఒక నెల వేతనం ఇస్తే ఒప్పుకునేది లేదంటూ సిఐటియు నాయకత్వం అధికారులకు తెలిపింది. వైఎస్ఆర్‌టియు, ఐఎఫ్‌టియు నాయకత్వం మాత్రం నెల వేతనంతో సమ్మతించి సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. స్ట్రగుల్ కమిటీ నిర్ణయాలకు వ్యతిరేకంగా అధికారులతో మమేకం అవుతూ వారు చెప్పిన వాటికి అంగీకరించడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకించింది. సిఐటియు అనుబంధంగా కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అధికారులకు తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, అధికారుల వైఖరిని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి బోర్డు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు వేతనాలు, పిఎఫ్, 22 సంవత్సరాలుగా చెల్లిస్తున్న సౌకర్యాలు అమలు చేసేంతవరకు సమ్మె యథావిధంగా కొనసాగింపు ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు అడిగితే నిర్బంధం పాటించడం సరైనది కాదన్నారు. డిమాండ్లన్నీ పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మధుసూదన్, వన్నూరప్ప, గోవిందు, చింతకాయల నరేష్, రాము, శ్రీరాములు, లక్ష్మీరెడ్డి, చిన్న బాబయ్య, రవీంద్ర చారి, ప్రసాద్ పాల్గొన్నారు.

2,518 మంది కౌలు రైతులకు 'భరోసా'

అనంతపురం : జిల్లాలోని 2,518 మంది కౌలు రైతులకు రైతుభరోసా మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.7500 చొప్పున రైతుల ఖాతాలకు సిఎం జగన్ శుక్రవారం బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని ఎన్ఐసి హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఇందులో భాగంగా జిల్లాలో 2,518 మంది కౌలురైతులకు రూ.1.88 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

రాయదుర్గం : పట్టణంలోని 32వ వార్డు వాల్మీకి నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాలనీవాసులతో కలిసి వాల్మీకి నగర్‌లోని బళ్లారి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ వాల్మీకి నగర్ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ దీపాలు, తదితర సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గతంలో సిపిఎం ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే వాల్మీకి నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ సహాయ కార్యదర్శి మధు, నాయకులు నాగరాజు, తిమ్మరాజు, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, సుభాన్, హారూన్, దాదా పీర్, నాగేంద్ర నాయక్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పింఛను సొమ్ము కోసం లబ్ధిదారులు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయాల వద్ద పడిగాపులు కాచారు. బొమ్మనహాల్‌లో 22 మంది వాలంటీర్లు ఉన్నా ఇంటి వద్దకే వెళ్లి పింఛను మొత్తాన్ని అందివ్వాలని ఆదేశాలు ఉన్నా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నారు. దీంతో వృద్ధులు నానా అవస్థలు పడి సచివాలయం వద్దకు చేరకుని పింఛను సొమ్ముపై పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. గ్రామంలో వివిధ రకాల పింఛన్లు 450 ఉండగా 1వ తేదీ కేవలం 50 మందికి మాత్రమే పింఛన్ల సొమ్ము అందిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగిలిన వారికి 5వ తేదీ లోపు పూర్తి చేస్తామంటూ పంచాయతీ కార్యదర్శి బాబాఫకృద్దీన్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై ఎంపిడిఒ షకీలా బేగంను వివరణ కోరగా గత నెలలో అందరికీ పంపణీ చేశామని, ఎవరికీ పెండింగ్ లేవని తెలిపారు.



సచివాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

చంద్రబాబుకు పట్టిన గతే జగన్‌కూ..

◆ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ఉమామహేశ్వరరావు ◆ విద్యుత్ భారాలపై సిపిఎం ఆగ్రహం ◆ కరెంటు బిల్లులు దహనం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



సచివాలయం వద్ద విద్యుత్ బిల్లులను కాల్చివేస్తున్న సిపిఎం నాయకులు

కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోకపోగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసి భారాలు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పట్టిన గతే పడుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెంచి భారాలు మోపడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. సిపిఎం అనంతపురం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సర్కిల్ సమీపంలోని వార్డు సచివాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై భారాలు మోపడమే పనిగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కరెంటు ఛార్జీలను యూనిట్ పైన కాకుండా సర్వీస్ ఛార్జీ, ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో వివిధ రకాలైన అదనపు భారాలను మోపి అసలు కంటే వడ్డీ ఎక్కువ అన్నట్లు వాడిన కరెంటు కంటే అదనంగా వస్తున్న కరెంటు బిల్లు ఎక్కువగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రభుత్వాలు కావని, ఇవి ప్రజలను హింసించే ప్రభుత్వాలని విమర్శించారు. ఒక వైపు వర్షాలు పడక వేసిన పంట ఎండిపోతుంటే ఏమి చేయాలో దిక్కుదోచని స్థితిలో ఉన్న రైతులపై విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలిపోటులా తయారు అయ్యాయన్నారు. బోర్ల కింద వేసుకున్న పంటను కాపాడుకోలేక రైతులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్నా ఒక్క ప్రజా ప్రతినిధి కూడా వీరి సమస్యపై పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాలు నరేంద్ర మోడీ విధానాలను విమర్శించకుండా ఇక్కడ ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ప్రజల పట్ల అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై వామపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.సావిత్రి, నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, వలీ, ఎన్టీఆర్ శీన, రాజు, ప్రసాద్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, ఏటీఎం నాగరాజు, తిరుమలేసు, వరలక్ష్మి, రామాంజి, చిరంజీవి, ఫర్యాది, మరియమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



నూతన కమిటీతో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం అనంతపురం నగరంలో న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటిదాకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోగా ఇప్పటికే ఫస్ట్ యూనిట్ టెస్ట్ సెకండ్ టెస్ట్ కూడా పూర్తి చేశారన్నారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండానే పరీక్షలు పూర్తి చేసిన ప్రభుత్వానికి ఏమాత్రం ఆలోచన జ్ఞానం లేదని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతుంటే ఆ విద్యార్థుల అర్ధాకలితో విద్యను అభ్యసించాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం పున ప్రారంభించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహకారదర్శి సిద్దు, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు శివ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ న్యూటౌన్ జూనియర్ కళాశాల కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ తెలిపారు. న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యదర్శిగా బాలు, అధ్యక్షుడు మాదేశ్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్, అనిల్, మహేష్, లక్ష్మీకాంత్, గురుప్రసాద్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎల్ఐసి వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని భారతీయ జీవిత బీమా శాఖ-1 కార్యాలయంలో సీనియర్ బ్రాంచి మేనేజర్ బీడీ మధుబాబు అధ్యక్షతన శుక్రవారం ఎల్ఐసి 76వ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిబిఐ బ్యాంకు మేనేజర్ ప్రభంజన్ మాట్లాడుతూ దేశంలో జీవిత బీమా రంగంలో ఎల్ఐసి అగ్రభాగాన ఉందన్నారు. ఎన్ని ప్రయివేటు బీమా సంస్థలు వచ్చినప్పటికీ 1956లో ప్రారంభ మైన ఎల్ఐసి సంస్థ పాలసీదారులకు మెరుగైన సేవలను అందిస్తోందన్నారు. సీనియర్ బ్రాంచి మేనేజర్ మధుబాబు మాట్లాడుతూ దేశంలో దాదాపు 32 వేల కోట్ల మంది పాలసీదారులను కలిగి ఉండి, 13 లక్షల మంది ఏజెంట్లతో, లక్ష మంది ఆఫీస్ సిబ్బందితో సేవలందిస్తున్న ఏకైక సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ అన్నారు. క్లెయిమ్స్ సెటిల్‌మెంట్‌లో పాలసీదారులకు మంచి బోనస్ ఇవ్వడంలో ఎల్ఐసి అగ్రభాగాన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కియా మేనేజర్ మధు, ఆఫీసర్ యూనియన్ అసోసియేషన్ పురుషోత్తం, సహాయ బ్రాంచి మేనేజర్లు ఫణికుమార్, నందీశ్వర్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సూరిబాబు, జ్యోతిప్రభ, శ్రీదేవి, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ తరపున విశ్వనాథ్, ఏజెంట్స్ అసోసియేషన్ తరపున తిరుపతయ్య, వేణుగోపాల్, వెంకటేశ్వరరెడ్డి, బాలం భాస్కర్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బీ.టెక్ 3వ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, విభాగ అధిపతులు విష్ణువర్ధన్, కె.ఎఫ్.భారతి, కళ్యాణి రాధ, దిలీప్‌కుమార్, ఎం.రామశేఖరరెడ్డి, భువనవిజయ, లలితకుమారి, అజిత, తదితరులు పాల్గొన్నారు.



వసుంధర



దుర్గాప్రసాద్



రామశేఖర్‌రెడ్డి

జెఎన్‌టియు నూతన పాలక మండలి నియామకం

ముగ్గురు ప్రొఫెసర్లకు చోటు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు నూతన పాలకమండలి సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించిందని ఉపకులపతి జి.రంగ జనార్ధన తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామల రావు జీవో నెం: 81ను విడుదల చేశారని తెలిపారు. ఆరుగురితో ఏర్పాటు చేసిన జెఎన్‌టియు పాలకమండలి సభ్యుల్లో జెఎన్‌టియు నుంచి ముగ్గురు అధ్యాపకులు ఎంపిక అయినట్లు తెలిపారు. వారిలో సీనియర్ అధ్యాపకుల కోటాలో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆచార్యులు బి.దుర్గా ప్రసాద్, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్ల కోటాలో పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, యూనివర్సిటీ కళాశాలలు అధ్యాపకులు కోటాలో అనంతపురం జెఎన్‌టియు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డిని నియమించారన్నారు. వీరితో పాటు ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు ప్రిన్సిపాళ్ల కోటాలో చిత్తూరు శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జ్యోతేశ్వరి, అధ్యాపకుల కోటాలో అనంతపురం జిల్లాలోని ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.మేరీమాత, మేనేజ్మెంట్ కోటాలో కర్నూలు పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ జివిఎం.మోహన్, ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ హరిచంద్రరామ, ఈకామర్స్ విభాగం నుంచి అంజలి, ఇంటర్‌వెంట్ కార్డియాలజీ కింద డాక్టర్ ఎం.వంశీకష్ణను నియమించినట్లు తెలిపారు. నూతన పాలక మండలి సభ్యులుగా ఎంపిక అయిన వారికి ఉపకులపతితో పాటు రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లు అభినందనలు తెలిపారు.

విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బిటిపి రోడ్డు మోడల్ కాలనీ, బళ్లారి రోడ్డులోని గౌడ లేఔట్‌లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను శుక్రవారం విప్ కాపు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడ లేఔట్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో కాపు మాట్లాడుతూ స్థానికంగానే ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్ విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న వైసిపిని మరోమారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, గౌనిఉపేంద్రరెడ్డి, వలిబాషా, కౌన్సిలర్లు, వైద్యులు అలేఖ్య, అజర్‌ఖాన్, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసు లు, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కేసుల్లో చంద్రబాబుకు శిక్ష ఖాయం

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అత్యంత అవినీతిపరుడని గతంలో తెహల్కా డాట్ కామ్ వెల్లడించిందన్నారు. విదేశాల్లో సైతం అక్రమంగా కోట్లాది రూపాయల ఆస్తులను కూడాబెట్టినట్లు దర్యాప్తుల్లో వెల్లడైందన్నారు. పలు అవినీతి కేసులు నమోదు కాగా పలుకుబడితో కోర్టులో కేసులను తప్పించుకుంటూ ప్రధాని మోదీ బూట్లు నాకుతూ, హోం మంత్రి అమిత్‌షా కాళ్లు పట్టుకుంటూ తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపించారు. టిడిపి హయాంలో రకరకాల పథకాల పేరిట చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు, వారి అనుచరులు ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారన్నారు. చంద్రబాబు చట్టం నుంచి తప్పించుకోలేరు. ఏదో ఒక రోజు శిక్ష పడటం ఖాయమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు, ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని కోరారు.

నార్పల తహశీల్దార్‌గా హరికుమార్

నార్పల : మండల నూతన తహశీల్దార్‌గా హరికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణస్వామి అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా సురేష్‌బాబు కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో కలెక్టరేట్‌లో రిలీవ్‌లో ఉన్న హరికుమార్‌ను నార్పల తహశీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం స్థానిక కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఎస్‌డిటి రాజశేఖర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జ్యోతిరాణి, ఉద్యోగులు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం తహశీల్దార్ హరికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమన్వయంతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను ప్రజలకు అందిస్తామన్నారు.

బీమా వారోత్సవాలు ప్రారంభం

రాయదుర్గం : పట్టణంలోని భారతీయ జీవిత బీమా సంస్థ కార్యాలయంలో శుక్రవారం 67వ బీమా వారోత్సవాలను ప్రారంభించి నట్లు ఆ సంస్థ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కె.మల్లికార్జునయ్య తెలిపారు. ఏటా సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ దేశవ్యాప్తంగా అన్ని ఎల్ఐసి కార్యాలయాల్లో బీమా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారోత్సవాల్లో మొదటి రోజున పాలసీదా రుల సేవల కోసం స్పెషల్ కౌంటర్ ఏర్పాటు చేశామని, ఇందులో పాలసీదారుల సమస్యలకు పరిష్కారాలు, సూచనలు ఇస్తారన్నారు. అలాగే విద్యార్థులకు జీవిత బీమా సంస్థ, వాటి సేవలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథం, అభివృద్ధి అధికారులు, ఆఫీస్ సిబ్బంది, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.

బూర్జువా పార్టీలకు బుద్ధిచెబుదాం

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి-'సమరభేరి'లో సిపిఎం నాయకులు




యాడికిలో సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఉరవకొండలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-యాడికి

ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్రాల్లోని బూర్జువా పార్టీలను భూస్థాపితం చేసి సాగనంపుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో విత్తన సాగు చేయలేదన్నారు. అరకొరగా సాగుచేసిన పంటలు కూడా ఎండిపోయాయన్నారు. వీటితోపాటు రూ.లక్షలు అప్పులు చేసి బోర్లు, బావుల కింద చేసిన పంటలు కూడా అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ కోతల కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, సాగు చేయని రైతులకు రూ.30వేలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా వేరుశనగ పంట సాగు పూర్తిస్థాయిలో తగ్గిపోయిందన్నారు. ఈక్రాప్ బుకింగ్ పేరుతో అధికారుల హడావిడి తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు అనుకూలంగా చట్టాలను మారుస్తోందన్నారు. రైతు రుణాలు మాఫీ చేయాలని, రూ.400 గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయాలన్నారు. 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, మండల కేంద్రాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనాలను ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో శ్మశాన వాటికలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు గోవిందప్ప, కమిటీ మెంబర్లు కేశవనాయుడు, సిపిఎం మండల కార్యదర్శి బషీర్ అహమ్మద్, టౌన్ కార్యదర్శి మాయకుంట్ల మోహన్, కె.శ్రీనివాసులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

తాడిపత్రి : ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా తాడిపత్రిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఉమాగౌడ్, సిఐటియు మండల కార్యదర్శి హనుమంతురెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి రవికుమార్, చారి, రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, భాస్కర్, ఓబులేసు, రాముడు పాల్గొన్నారు.

పుట్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని, ధరలు తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పుట్లూరు సచివాలయంలో సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ మండల కార్యదర్శి ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.భాస్కర్‌రెడ్డి, టి.పెద్దయ్య, పృథ్వీ, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్రాల్లోని బూర్జువా పార్టీలను భూస్థాపితం చేసి సాగనంపుదామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి జీపుజాత శుక్రవారం ఉరవకొండలోని అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హెచ్ఎల్సి కాలువ ఆధునీకరణ పనులు చేయకపోవడంతో 15 రోజుల్లో రెండుచోట్ల హెచ్చెల్సీకి పడిందని గుర్తు చేశారు. ముఖ్యంగా రాగులపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాల్లోని 26 గ్రామాల భూములకు సాగునీరు అందించే ప్రక్రియ పూర్తి చేయకుండా స్వార్థ రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉరవకొండ, వజ్రకరూరు మండల కన్వీనర్లు మధుసూదన్, విరుపాక్షి, సిఐటియు గుంతకల్లు పట్టణ కన్వీనర్ దాసరి శ్రీనివాసులు, సిపిఎం నాయకులు రామాంజనేయులునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వంతుపాడుతోందన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాల్సిన అవసరం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమాగౌడ్, నాగరాజు, చంద్ర పాల్గొన్నారు.

శింగనమల : వేరుశనగ పంట వేసి నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేలు, పంట వేయని రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ డిస్ట్రిబ్యూటర్ కాలువ బైపాస్ కెనాల్ పనులు పూర్తి చేసి సలకం చెరువుకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేశన్న, మునెప్ప, ఆంజనేయులు, నాగరాజు, లక్ష్మీనారాయణ, వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం-2లో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు జయమ్మ, రైతుసంఘం మండల కార్యదర్శి సువర్ణమ్మ, రైతు మల్లన్న, విశ్వనాథరెడ్డి, వన్నక్క, మహేష్, వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ప్రజల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం-1 ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సమరభేరి జీపుయాత్రను నిర్వహించామన్నారు. ఈయాత్రలో అన్నివర్గాల ప్రజలు తమ సమస్యలపై ఏకరువు పెట్టారన్నారు. వారి తమ దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, మండల నాయకులు నెట్టికంటయ్య, నాగేంద్ర, సంజీవరెడ్డి, నామాల వెంకటేష్, సి.మునిస్వామి, బి.రవికుమార్ పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన 8వ వార్డు సచివాలయం వద్ద శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సచివాలయ విద్యా కార్యదర్శి కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి వెంకటేష్, బాలగిరి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమరభేరిలో భాగంగా సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని, వంటనూనె, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని కోరారు. ఆస్తి పన్ను పెంపును ఉపసంహరించుకోవాలని, చెత్త పన్ను రద్దు చేయాలని, పట్టణ ప్రాంతంలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి మధు, తిమ్మరాజు, సుభాన్, హారూన్, నగేష్‌నాయక్, రమేష్‌కుమార్, ఖాజా, దాదాపీర్ పాల్గొన్నారు.

మరో పోరాటానికి సిద్ధం కండి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జెవివి జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు అధ్యక్షతన యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకూ ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పని మార్పు చేయాలన్నారు. ఇఎస్ఐ, ఇపిఎఫ్ సమస్యల పరిష్కారానికి కన్సల్‌టెంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కాగా ఈనెల 24న చలో విజయవాడకు వెళ్లి రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్ ఎక్కే ప్రయత్నంలో గాయపడిన మున్సిపల్ కార్మికురాలు పెద్దక్కకు కార్మికులతో సేకరించిన రూ.75,150 నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు (కడప) విజయ్‌కుమార్, ప్రొద్దుటూరు సాల్మాన్, చంటి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, జగదీష్, సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గురురాజు, వై.వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్ష కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, తిరుమలేష్, నాయకులు అంజి, వన్నూరప్ప, జుబేర్, రాము, మల్లేష్, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, వన్నూరుస్వామి, శేషేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఆదినారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని పసులూరు, ముచ్చుకోట గ్రామాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7వతేదీ వరకూ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారాయణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో ఎంపిపి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు సిఎం జగన్ పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సిడిపిఒ ఉమాశర్మ, ఎంపిడిఒ విజయభాస్కర్, సూపర్‌వైజర్ మణెమ్మ, వైసిపి నాయకులు మునేరు కొండమ్మ, బుల్లె నారాయణస్వామి, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

15లోపు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలి

ఉరవకొండ : ఈనెల 15వ తేదీలోపు ఈక్రాప్ నమోదును పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారులు సూచించారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని మోపిడి, విడపనకల్ మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామాల్లో గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగచేసిన పంటల వివరాలను కచ్చితంగా ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య, రైతు భరోసా సిబ్బంది పరిమళ, అగ్రీ బోర్డు ఛైర్మన్ రామాంజనేయులు, రైతులు సూర్యనారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు తీసుకుని మోసం..

న్యాయం చేయాలని బాధితుల మొర

ప్రజాశక్తి-అనంతపురం

వడ్డీ పేరుతో డబ్బులు తీసుకుని తిరిగి వెనక్కు ఇవ్వకుండా ఓ వ్యక్తి మోసం చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అనంతపురానికి చెందిన ఆదినారాయణ మరికొందరు బాధితులు విలేకరులతో మాట్లాడుతూ గూగూడు గ్రామానికి పక్కన ఉన్న గంగనపల్లికి చెందిన శ్రీరాములు నాయుడు కుమారుడు సూదలకుంట నరేష్ కుమార్ నాయుడు పలువురు దగ్గర వడ్డీ పేరుతో డబ్బు తీసుకున్నాడని చెప్పారు. తనతో పాటుగా మిత్రులను పరిచయం చేసి ఓ సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పి డబ్బులు కట్టించుకున్నాడని చెప్పారు. ఈ డబ్బులకు వడ్డీ ఇస్తానని చెప్పిన ఆయన కొంతకాల తరువాత డబ్బులు ఇవ్వకుండా ఐపీ నోటీసులు పంపాడన్నారు. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని ఇలా మోసం చేయడం తగదని పోలీసులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

శింగనమల : చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి సూచించారు. శుక్రవారం మండలం పరిధిలోని సి.బండమీదపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా చూడాలన్నారు. వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉంటే మాతాశిశు మరణాలు ఉండవన్నారు. ఇకపోతే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎం, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

'ఆహా' క్యాంటీన్ ప్రారంభం

రాయదుర్గం : పేదలకు తక్కువ ధరకు ఆహారం అందించేందుకు స్వయం సహాయక సంఘాల సహకారంతో పట్టణంలోని లక్ష్మీ బజార్‌లో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఎదురుగా ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి మాట్లాడుతూ మెప్మా స్వయం సహాయక సంఘాలు ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, మున్సిపల్ ఇంజినీర్ సురేష్, కౌన్సిలర్లు నాగవేణి, శ్రీనివాసరెడ్డి, శ్రీలక్ష్మి, లావణ్య, డిష్ గోవిందు, గోవిందరాజులు, సంజీవప్ప, దేవరాజు, పెద్ద వన్నూరప్ప, ఫకృద్దీన్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, కె.శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జి పొరాలు శివ, తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 29, 37, 38, 44వ డివిజన్ల పరిధిలో నూతనంగా మంజూరైన సామాజిక భద్రతా పింఛన్లను మేయర్ మహమ్మద్ వసీం శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్హత ఉన్న లబ్ధిదారులకు నూతనంగా 628 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. దేశంలో ఏక్కడా లేనివిధంగా ఇంటి వద్దకే తెల్లవారుజామునే పింఛన్లు అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. అదేవిధంగా 29వ డివిజన్‌లో నూతన రేషన్‌కార్డులను సైతం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరాభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

అనంతపురం : వైసిపి అధికారంలోకి వచ్చాక నగరంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు 50 డివిజన్ పరిధిలో ఉన్న సచివాలయ కన్వీనర్, గృహసారథులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి శుక్రవారం పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మనం చేసిన మంచిని గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద సూచిక బోర్డుల ఏర్పాటు

బుక్కరాయసముద్రం : ఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలోని వడియంపేట, ముసలమ్మకట్ట, బుక్కరాయసముద్రం ప్రాంతాల్లోని బ్లాక్‌స్పాట్స్, జంక్షన్లలో రోడ్డు ప్రమాద సూచిక నూతన బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన బోర్డులను గమనించి వాహనచోదకులు ప్రయాణం చేయాలని సూచించారు. ఆర్డీటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ బోర్డుల్లో ప్రమాదం జరిగే స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీఆర్బీ సిఐ.విశ్వనాథచౌదరి, బుక్కరాయ సముద్రం సిఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని బాలుడి మృతి



మృతి చెందిన ఆదిత్య (ఫైల్ ఫొటో)

రాయదుర్గం రూరల్ : బొలెరో వాహనం ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని 74-ఉడేగోళం గ్రామ సమీపంలో రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై చోటుచేసుకొంది. మూలికలు తీసుకునేందుకు రాయదుర్గం పట్టణానికి చెందిన రవికుమార్‌రెడ్డి, రోజా దంపతులు కుమారుడు ఆదిత్య(5)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఉడేగోళం వెళ్లారు. అక్కడ ఆదిత్యతో పాటు రోజా బైక్ దిగారు. అయితే ఆదిత్య ఉన్నఫలంగా ప్రధాన రహదారిపైకి వెళ్లడంతో రాయదుర్గం నుంచి అనంతపురం వైపు వెళ్లే బొలెరో వాహనం వేగంగా ఢీ కొట్టడంతో ఆదిత్య అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి రవికుమార్‌రెడ్డి బొలెరో వాహనాన్ని పట్టుకునేందుకు ఆవులదట్ల వరకూ వెంబడించినప్పటికీ డ్రైవర్ వేగంగా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎఎస్ఐ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రవికుమార్‌రెడ్డి రాయదుర్గం గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆదిత్య పట్టణంలోని స్టోన్ వ్యాలీ స్కూల్‌లో ఎల్‌కెజి చదువుతున్నట్లు బంధువులు తెలిపారు. వారికి ఇద్దరు కుమారులు కాగా ఆదిత్య పెద్దవాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సచివాలయ, గృహ నిర్మాణ శాఖ ఉద్యోగులు, స్టోన్ వ్యాలీ పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు.

వివాహిత అనుమానాస్పద మృతి

శింగనమల : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో యువతి అనుమానాస్పదంగా మృతిచెందిన చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పెరవలిలోని ఎస్సీ కాలనీకి చెందిన వెంకటేష్ భార్య సుహాసిని (23) గురువారం ఉదయం తన అన్నకు రాఖీ కట్టేందుకు వెళ్లాలని భర్తకు చెప్పింది. ఇందుకు భర్త నిరాకరించాడు. దీంతో మనస్థాపానికి గురైన సుహాసిని ఇంట్లోకి వెళ్లి తలుపునకు గడి వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమణించిన భర్త వెంకటేష్ తలుపు బద్దలు కొట్టి సుహాసిని కిందికి దించాడు. వెంటనే బంధువుల సాయంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతిచెందింది. కాగా తమ కూతురిని భర్త, బంధువులు హత్య చేశారని మృతురాలి తల్లి, బంధువులు ఆరోపించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో మహిళ...



మృతిచెందిన కుళ్లాయమ్మ

పుట్లూరు : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లుట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంగయ్య భార్య కుళ్లాయమ్మ (35) మరుగుదొడ్డిలో నీటిని వేడు చేసుకునేందుకు హీటర్ వేసింది. తిగిరి హీటర్ తీస్తున్న సమయంలో షాక్ కొట్టి కింద పడిపోయింది. వెంటనే బంధువులు నార్పల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

మూడు గ్రామాల్లో రీసర్వే పూర్తి

గుంతకల్లురూరల్ : మండలంలోని మూడు గ్రామాల్లో జగన్న భూ రీసర్వే పూర్తయినట్లు తహశీల్దార్ బి.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం కింద మండల పరిధిలోని సంగాల, దంచర్ల, తిమ్మాపురం గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో సరిహద్దు రాళ్లను కూడా నాటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మారెప్ప, శ్రీనివాసులు, సచివాలయ సర్వేయర్ నారాయణరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన ఓ యువతీ వివాహానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం ఆర్థికసాయం చేశారు. సూర్యకాంతరెడ్డి, వై.లీలావతి కుమార్తె నందిని వివాహానికి స్థానిక పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.50 వేలు ఆర్థికసాయాన్ని వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సి.మల్లయ్యయాదవ్, కౌన్సిలర్ వి.వరదరాజులు, మండల బూత్ కన్వీనర్ విశ్వనాథరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు, ఎంసీ.నాగరాజు, పగడాల శ్రీనివాస్, చికెన్ వెంకటేష్, గోపాల్, భాస్కర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలకు తావివ్వొద్దు : ఆర్‌డిఒ

గుత్తి : ఇంటింటి సర్వేలో భాగంగా వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి అవకతవకలు లేని ఓటరు జాబితాను తయారు చేసేందుకు చర్యలు చేపట్టాలని గుంతకల్లు ఆర్‌డిఒ అధికారి రవీంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు అధ్యక్షతన వివిధ శాఖ అధికారులు, బిఎల్ఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విధించిన గడువులోపు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు సంబంధించి పూర్తి వివరాల డేటాను సమర్పించాలని బిఎల్ఒలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, కమిషనర్ జి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

గుత్తి : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు తలారి సరోజమ్మ, మాజీ ఎంపిపి వీరేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బసినేపల్లి గ్రామంలో టిడిపి అధ్వర్యంలో మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు మహిళలు, టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీదేవి, సభ్యురాలు లీలావతి, అసెంబ్లీ అధ్యక్షురాలు అంజలీదేవి, జయమ్మ, మాధవి, టిడిపి నాయకులు షేక్ పజులు, మహమ్మద్ అలీ, మల్లికార్జున, నాగరాజు, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ కమిటీ ఏర్పాటు

గుంతకల్లు : డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సురేంద్ర ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మద్దికెర ప్రతాప్, కార్యదర్శులు దాసరి చరణ్‌కుమార్‌తోపాటు 15 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు సురేంద్ర, పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనాథ్, యశ్వంత్ పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

అనంతపురం : రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో నూతనంగా నియమితులై వివిధ పదవులు పొందిన నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. పార్టీ ఆదేశించే పనులను నిర్ణీతకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ఆర్టీసీ బస్టాండ్ గదుల లీజుకు వేలం

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో పరిధిలోని కంబదూరు, ఆత్మకూరు, కళ్యాణదుర్గం బస్టాండ్ల ఆవరణలో ఉన్న గదులకు లీజు వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంబదూరులో 11, ఆత్మకూరులో 5, కళ్యాణదుర్గంలో 9 గదులకు ఐదేళ్ల కాల పరిమితికి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 12వ తేదీ లోపు కళ్యాణదుర్గం డిపో మేనేజర్‌ను సంప్రదించి వేలం దరఖాస్తును పొందాలని సూచించారు.